క్లుప్తంగా

ఆరుగురు బైండోవర్

గన్నేరువరం: మండలంలోని ఆరుగురిని ఎక్సైజ్ ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తహసీల్దార్ భిక్షపతి ఎదుట బైండోవర్ చేశారు. జంగపల్లి, హన్మాజిపల్లెకు చెందినవారు మద్యం విక్రయాలు చేశారని మళ్లీ అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముందు జాగ్రత్తగా బైండోవర్ చేశామని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీ ఏర్పాటు

గన్నేరువరం: మండలకేంద్రంలో 301/బీలోని సీలింగ్ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని రెవెన్యూ, పంచాయతీ అధికారులు తెలిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజినీస్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ సిబ్బందితో కలిసి మంగళవారం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని తెలిపారు. పట్టాభూమి, సీలింగ్ భూమి విస్తీర్ణం నిర్ధారణ చేసే వరకు క్రయవిక్రయాలు చేయొద్దని హెచ్చరించారు.

కాపర్ వైర్ చోరీ

చిగురుమామిడి: మండల కేంద్రంలోని శ్మశాన వాటిక వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి లక్షరూపాయలకుపైగా విలువ చేసే కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సోమవారం అర్ధరాత్రి సంఘటన జరిగినట్లు చిగురుమామిడి ఏఈ తెలిపారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

కాలువ కబ్జాపై విచారణ

హుజూరాబాద్: పట్టణ శివారులోని మోడల్ చెరువు నుంచి గుండ్ల చెరువుకు వెళ్లే కాలువ కబ్జాకు గురైందని పలువురు చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు మంగళవారం విచారణ జరిపారు. నీటిపారుదలశాఖ ఏఈ రవిచందర్, ఆర్ఐ శేఖర్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అశ్విని గాంధీ ప్రత్యక్షంగా పరిశీలించి కొంతమేరకు ఆక్రమణకు గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. రెండు రోజుల తర్వాత సర్వే చేయించి హద్దులను ఏర్పాటు చేస్తామని రవిచందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

మానకొండూర్: మండలంలోని జగ్గయ్యపల్లి, వెల్ది–లింగాపూర్ గ్రామాల మధ్య మంగళవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు.. లింగాపూర్ శివారులోని మానేరు వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక లోడు చేసుకుని కరీంనగర్‌కు వెళ్తుండగా మానకొండూర్ నుంచి లింగాపూర్‌కు వైపు వస్తున్న మరో ట్రాక్టర్ జగ్గయ్యపల్లి మూలమలుపు వద్ద ఎదురుగా వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర ట్రాలీ బోల్తాపడగా ఇంజిన్ పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఘటనలో రమేశ్ అనే డ్రైవర్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని వెల్ది–రంగపేట గ్రామాల మధ్య రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనగా ఇద్దరికి గాయాలు అయ్యాయి. వెల్ది గ్రామానికి చెందిన పప్పు మంగతో పాటు మరో వ్యక్తి స్వల్పంగా గాయపడినట్టు స్థానికులు తెలిపారు.

సింగాపూర్ కిట్స్ కళాశాలకు అకాడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలను బ్రెనో విజన్ సంస్థ అకాడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపిక చేసిందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ మంగళవారం తెలిపారు. బ్రేనో విసన్ సంస్థ దేశంలోని వివిధ కళాశాలను పరిశీలించి అవార్డులను ప్రదానం చేసిందని అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అవార్డు ప్రదాన ఉత్సవ కార్యక్రమంలో ఏఐసీటీఈ చీఫ్ కోఆర్డినేటర్ బుద్ధ చంద్రశేఖర్ చేతుల మీదుగా కళాశాల ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వొడితెల ఇంద్రనీల్ ఈ అవార్డును అందుకున్నారు. కళాశాలకు అవార్డు రావడం పట్ల కళాశాల చైర్మన్ కెప్టెన్ వి. లక్ష్మీకాంతారావు, కళాశాల కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, వివిధ విభాగాధిపతులు హర్షం వ్యక్తం చేశారు.

టీసీసీ ఫలితాల్లో మైనార్టీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

హుజూరాబాద్: పట్టణ శివారులోని కేసీ క్యాంపు మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ)ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కామిశెట్టి కుమారస్వామి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదువుతున్న సబ్బని మణిదీప్ టీసీసీ డ్రాయింగ్ పరీక్షలో400 మార్కులకు 325 మార్కులు సాధించారని, అలాగే 11 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై చక్కని ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ బండ శారదను ఎంఈవో కేతిరి వెంకటనర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ అభినందించారు.


హుజూరాబాద్: ర్యాలీలో బీజేపీ నాయకులు, హనుమాన్ దీక్షాపరులు


చిగురుమామిడి: ఇందుర్తిలో మాలధారణ వేసుకున్న భక్తులు


రామడుగు: మజ్జిగ, పండ్లు అందిస్తున్న నాయకులు

ఘనంగా హనుమాన్ చిన్నజయంతి

హుజూరాబాద్: పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ చిన్నజయంతిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలకరించారు. హనుమాన్ దీక్షాపరులతో పాటుగా భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. బీజేపీ నాయకులు హనుమాన్ దీక్షాపరులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహిస్తూ జైశ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

చిగురుమామిడి: హనుమాన్ చిన్నజయంతి సందర్భంగా పలు ఆలయాల్లో భక్తులు మాలధారణ వేసుకున్నారు. ఇందుర్తిలో గురుస్వామి అనగోని శ్రీనివాస్ ఆధ్వర్యంలో విగ్రహాలకు ఎర్ర చందనంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో భక్తులు, అభిమానులు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. చిగురుమామిడి పాంబండ శ్రీపంచముఖాంజనేయస్వామి ఆలయంలో ఉమేశ్ స్వామి ఆధ్వర్యంలో చిన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మాల విరమణ చేసిన స్వాములను ఆశీర్వదించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జర్నలిస్టు గాదే రఘునాథరెడ్డి, ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు , ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో స్వామి విగ్రహానికి ఆలయ అర్చకులు గంగాధర శాస్త్రి అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

రామడుగు: కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై రామడుగు మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ స్టేజీ వద్ద కొండగట్టు శ్రీ హనుమాన్ దేవాలయం దర్శనం కోసం వెళ్లే హనుమాన్ స్వాములకు బీజేపీ నాయకులు పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు, నీరు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్ రెడ్డి, నాయకులు ఉప్పు రాంకిషన్, మీసాల సునీల్, పలువురు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని మారుతినగర్‌లోని శ్రీ పంచముఖ అంజనేయస్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అంజనేయ స్వామిని దర్శించుకున్నారు.

తిమ్మాపూర్: మండలంలోని ఆయాగ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చేవాడు హనుమంతుడని భక్తులు కొనియాడారు.

రథోత్సవం, శకటోత్సవం

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి గ్రామంలో మంగళవారం వేంకటేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు. రెడ్డి యూత్ వింగ్ ఆధ్వర్యంలో రెండు వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రి భజనలు నిర్వహించారు.

రుక్మాపూర్‌లో భజన పోటీలు

రుక్మాపూర్‌లో వేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా భజన మండలి సభ్యులకు పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు జట్లు పోటీలో పాల్గొనగా ఉత్తమ భక్తి పాటలు పాడిన జట్లను ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు.

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ పరిధి బొదరిపల్లిలో శ్రీవీరాంజనేస్వామి నవగ్రహ, ధ్వజప్రతిష్ఠ కార్యక్రమ వేడుకలు మంగళవారం వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


గన్నేరువరంలో ఎడ్ల బండ్లకు భక్తుల పూజలు


చొప్పదండి: రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

శకటోత్సవం

గన్నేరువరం: శ్రీలక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శకటోత్సవం నిర్వహించారు. గన్నేరువరంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్ర, ఇతర వాహనాలను శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయం చుట్టూ తిప్పి కుటుంబసభ్యులతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్సై తాండ్ర నరేశ్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం రథోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోయిని అంజయ్య, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రామడుగు: విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మండలంలోని గోపాల్‌రావుపేట అక్షర పాఠశాల వార్షికోత్సవం యుఫోరియా వేడుకలను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐఏఎస్‌కు ఎంపికైన వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో లయన్ కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, మాజీ సర్పంచ్ కర్ర సత్యప్రసన్న, బీసీ సెల్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, అశోక్ రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ మునీందర్, ప్రిన్సిపాల్ రాధ, టీచర్లు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పెద్దల పర్యవేక్షణ ఉండాలి

చొప్పదండి: వేసవి సెలవులల్లో పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని రెవెళ్లి యూపీఎస్ హెచ్‌ఎం సిరిపురం ఆనందం కోరారు. మంగళవారం పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేశారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ నేర్చుకోవాలని, ఇండోర్ గేమ్స్ నేర్చుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముల్కల కుమార్ పాల్గొన్నారు.


చొప్పదండి: ప్రోగ్రెస్ కార్డులతో విద్యార్థులు


రామడుగు: మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

బేసిక్స్ మరిచిపోకుండా చూసుకోవాలి

రామడుగు: వేసవి సెలవుల్లో విద్యార్థులు క్రమశిక్షణతో పాటు బేసిక్స్ మరిచిపోకుండా తల్లిదండ్రులు చూసుకోవాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి అశోక్‌రెడ్డి తెలిపారు.మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్–2024 సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో సెక్టోరియల్ అధికారి ఆంజనేయులు, మండల విద్యాధికారి వేణుకుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలు పక్కన బెట్టి చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి కార్మికులను ఆదుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని పద్మశాలీవాడలోని చేనేత సహకార సంఘాన్ని మంగళవారం సందర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం కార్మికులకు పని కల్పించి, వస్త్రాలు కొనుగోలు చేసి, రూ.ఐదు లక్షల బీమా కల్పించి ఆదుకుందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల కష్టాలు పట్టించుకోవడం లేదని, జమ్మికుంటలో, హుజూరాబాద్, ఉమ్మడి జిల్లా పరిధిలో మిగిలిన స్టాక్‌ను కొనుగోలు చేసి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. చేనేత శాఖ మంత్రికి కార్మికులపై అవగాహన లేదని, కార్మికులను ప్రభుత్వం ఆదుకోని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, చేనేత సంఘాల నాయకులు రమేష్, అనందం,కౌన్సిలర్లు, కార్మికులు ఉన్నారు.


వస్త్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మాజీ ఎంపీపీ కుంట రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు, రామకృష్ణకాలనీరెడ్డి సంఘం అధ్యక్షుడు దావు సంపత్‌రెడ్డి మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో డీసీసీ చీఫ్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ విప్ ఆరెపల్లి మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, మామిడి అనిల్, రెడ్డిగాని రా జు, నాయకులు మాచర్ల అంజయ్య, కుమార్, శ్రీనివాస్, కొండలరావు, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, భూమయ్య, భూపతి యాదవ్, అనిల్, నరేశ్, సంపత్, విజేందర్‌రెడ్డి, శ్రీధర్, రాము, రాజు ఉన్నారు.


సంపత్ రెడ్డి, రాజేందర్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఉద్యోగుల సేవలు గుర్తుంటాయి


విజయలక్ష్మిని సన్మానిస్తున్న డీఈవో జనార్దన్‌రావు


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రామడుగు: ఉద్యోగ విరమణ తప్పనిసరి కానీ ఉద్యోగుల సేవలు మాత్రం గుర్తుంటాయని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు అన్నారు. మండలంలోని వెలిచాల జిల్లా పరిషత్తు పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కన్నం రమేశ్, ఉపాధ్యాయులు పద్మలతాదేవి, రామస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, కృష్ణవేణి, లక్ష్మీరాజం, చొక్కయ్య, సజిత, రమణారెడ్డి, వెంకటేశం, సరోజన, సదయ్య పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీ పాఠశాలలో వర్క్ అడ్జెస్టమెంట్‌లో భాగంగా ఉల్లంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి జీవశాస్త్రం బోధించేందుకు ఉపాధ్యాయుడు గుర్రం చంద్రశేఖర్ వచ్చారు. మంగళవారం పాఠశాల చివరి రోజున ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. సైన్స్ లేకపోవడంతో విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చంద్రశేఖర్ డిప్యూటేషన్‌పై వచ్చి పదో తరగతి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. తిరిగి ఉల్లంపల్లికి వెళ్తున్నందున ఉపాధ్యాయులు, విద్యార్థులు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు కానుగంటి రాజమౌళి, శ్యామయ్య, జ్యోత్స్న, శంకరమ్మ, శంకర్, ప్రతిమ, శ్రీనివాస్, ఐలయ్య, జనప్రియ పాల్గొన్నారు.

- **పోలింగ్ కేంద్రాల పరిశీలన**

ఇల్లందకుంట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన మల్యాల, సిరిసేడు, ఇల్లందకుంట గ్రామాలను, సిరిసేడు చెక్‌పోస్టును హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ మంగళవారం పరిశీలించారు. గఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయిలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. సీఐ, పోలీసులు, కేంద్రబలగాలు, బీఎల్‌వోలు సిబ్బంది పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఏసీపీ శ్రీనివాస్‌జీ పరిశీలించారు.

- **కంటి వైద్య శిబిరం**

హుజూరాబాద్: పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రిటైర్డు ఉద్యోగులకు హైదరాబాద్‌లోని మెడివిజన్ ఆసుపత్రి వైద్యులు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గత నెల 17న సుమారు 100 మందికి పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షల కోసం ఎంపిక చేసిన వారితోపాటు మరో 30 మందికి మంగళవారం వైద్య పరీక్షలు చేశారు. శస్త్ర చికిత్సల కోసం హైదరాబాద్‌లోని మెడివిజన్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు డీపీ సింగ్, ఆర్గనైజేషన్ షేక్ ఖలీల్, టెక్నీషియన్ చేకూరి బాలాజీ, తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి విష్ణుదాస్ గోపాల్‌రావు, కోశాధికారి బాలాజీ, ప్రచార కార్యదర్శి జయవర్దన్, గాజుల చారుదత్తు, పదిరే గణపతిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిరవీందర్, శ్రీహరి, మౌటం రవీందర్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

- **భజన పోటీల్లో ద్వితీయ బహుమతి**

శంకరపట్నం: రాష్ట్రస్థాయి భజన పోటీల్లో కేశవపట్నం గ్రామానికి చెందిన శివకేశవ భజన మండలికి ద్వితీయ బహుమతి వచ్చింది. చొప్పదండి మండలంలోని రుక్మాపూర్‌లో వేంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో హరినామ సంకీర్తనలు, రాష్ట్రస్థాయి భజనపోటీలు నిర్వహించారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచడంతో ద్వితీయ స్థానం లభించింది. కార్యక్రమంలో నాగభూషణం, ప్రమోద్, శ్రీనివాస్, రాజుకుమార్, స్వామి, వెంకటేశ్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగ్స్ పంపిణీ



మనకొండూర్: మ్యాన్‌కైండ్ ఫార్మాస్యూటికల్ కంపెనీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)లో భాగంగా మండలంలోని రంగపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్కూల్ బ్యాగ్స్, లంచ్ బాక్స్, వాటర్ బాటిళ్లను ప్రధానోపాధ్యాయుడు రవీందర్, మ్యాన్ కైండ్ ఏరియా మేనేజర్ అమ్ముల తిరుమలేశ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ మంజుల, సంస్థ ప్రతినిధులు ప్రశాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

భూమిపూజ

మానకొండూర్: మండల కేంద్రంలోని చెరువుకట్ట వద్ద శ్రీమార్కండేయస్వామి ఆలయ నిర్మాణానికి పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భూమిచేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మోసాలతో కాంగ్రెస్ గద్దెనెక్కింది


రైతులతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని ముంజంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ మోసాలతో గద్దెనెక్కిందని, రుణమాఫీ ఎప్పుడు చేస్తారని ప్రశ్నించారు. మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.ఐదు వందల ఇస్తామని చెప్పి మాట తప్పడం సమంజసంకాదన్నారు. కౌలు రైతులకు రూ.12 వేలు సాయం చేస్తామని నోరుమెదపడం లేదని, యాసంగి పంటలకు సాగునీరు అందివ్వక పోవడంతో పంటలు ఎండాయని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు గాలిమాటలేనని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలెంకి మల్లేశం, రైతులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత


ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలందిస్తున్న ఎస్సై ఆరోగ్యం

సైదాపూర్: మండల కేంద్రానికి చెందిన ఇల్లందుల వెంకటేశ్(33) ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. మంచిర్యాలలో రైల్వే గేట్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్‌కు భార్య లాస్య, కూతురు, కుమారుడు ఉన్నారు. సైదాపూర్ మీసేవా కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసిన వెంకటేశ్‌కు మండలం వ్యాప్తంగా పరిచయాలున్నాయి. వెంకటేశ్ మిత్రులు వాట్సాఫ్ గ్రూప్ క్రియేట్ చేసి రూ.1.20 లక్షలు జమ చేశారు. అనంతరం మృతుడు కూతురు పేరున పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మంగళవారం ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను ఎస్ఐ ఆరోగ్యం చేతుల మీదుగా వెంకటేశ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గడ్డం శేఖర్, మునిపాల అశోక్, బాలకృష్ణ, మేడవేని రమేశ్, శ్రీకాంత్, సద్గుణాచారి, అనిల్‌కుమార్, అమరేందర్‌రెడ్డి ఉన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన


బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువకులు

గన్నేరువరం: బీజేపీతోనే సుస్థిరపాలన సాధ్యమని పార్టీ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం శివారు మఠంకు చెందిన పలువురు యువకులు మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా జగన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిచ్చారు.కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మునిగంటి సత్తయ్య, సోషల్ మీడియా కన్వీనర్ గూడెల్లి మల్లేశం పాల్గొన్నారు.